క్లుప్తంగా

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి



మంత్రికి స్వీటు తినిపిస్తున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన మంతూర్ సుధాకర్‌రెడ్డిని ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఉపాధ్యక్షుడిగా రాయికోడ్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్, డైరెక్టర్లుగా అనుసుజా, ఏడాకులపల్లి మైపాల్, చంద్రమ్మ, గోరే మీయా, పనిరాజ్, విఠల్, బక్కప్పా, ఎండి. ఖయ్యూం, అమరేశ్వర్, మహేశ్, కృష్ణ, ఖదీర్‌లను ఎంపిక చేసినట్లు తెలిసింది.

రేబిస్ వ్యాధిపై అవగాహన

జహీరాబాద్: రేబిస్ వ్యాధి నివారణపై శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండలంలోని పస్తాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాస్త్రవేత్త కైలాష్ మాట్లాడుతూ.. కుక్కల నుంచి ఈ వ్యాధి ఎలా వస్తుంది.. కుక్క కాటును నివారించేందుకు చిట్కాలు, కోపంగా ఉన్న లేదా భయపడిన కుక్కలు, కుక్క పిల్లలకు పాలిచ్చే సమయంలో వాటిని భయపెట్టవద్దని సూచించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి ప్రియాంక, ఉపాధ్యాయులు రత్న, అనిత, శైలజ, రోజా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని అయ్యప్ప మందిరంలో 30 మంది భక్తులు అయ్యప్ప మాలధరించి 108 రోజుల పాటు దీక్షను కొనసాగించనున్నారు. శనివారం గురుస్వాములు గొనే శంకర్, సుధాకర్‌గౌడ్ అయ్యప్ప మాలధారణ చేశారు. మాలధారణ స్వీకరించిన స్వాములను గురుస్వాములు అభినందించి, ఆశీస్సులు అందజేశారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ



కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం లక్ష్మన్‌నాయక్ తండాలో ఎంపీడీఓ మల్సూర్ శనివారం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ, వార్డుల ఓటరు జాబితా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం పాల్గొన్నారు.

మునిపల్లి ఎంఈఓగా భీంసింగ్

మునిపల్లి(అందోల్): బుదేరా ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న భీంసింగ్‌ను మునిపల్లి ఎంఈఓగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచిస్తామన్నారు. అలాగే, సమయపాలన పాటించాలని తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



షాకీర్ (ఫైల్)

జహీరాబాద్: మండలంలోని బూచనెల్లి శివారులోని నారింజ వాగులో ఈ నెల 25న గల్లంతైన షాకీర్ మృతదేహం లభించింది. శనివారం మండలంలోని సత్వార్ గ్రామ శివారులో భారీ వృక్షానికి తట్టుకుని ఉండగా గుర్తించారు. దీంతో అధికారులు సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు కర్ణాటకలోని బీదర్ పట్టణంలోని మైలార్ ప్రాంతానికి చెందిన షాకీర్(40)గా గుర్తించారు. మోటారు సైకిల్‌పై రోడ్డు దాటుతున్న క్రమంలో నారింజ వాగులో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే.

చౌటకూర్ ఆయూష్ వైద్యాధికారిగా సబితాపాటిల్

సంగారెడ్డి: మండల కేంద్రం చౌటకూర్ ఆయూష్ ఆస్పత్రి వైద్యాధికారిగా డాక్టర్ ఎం.సబితాపాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. రేగోడు ఆయూష్ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న సబితాపాటిల్ డిప్యుటేషన్‌పై చౌటకూర్‌కు వచ్చారు.

అసంపూర్తిగా షాదీఖానా

- శిథిలావస్థకు చేరిన హత్నూర భవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థకు చేరిన షాదీఖానా భవనం

హత్నూర(సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దశాబ్దాలుగా షాదీఖానా భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయని ఆయా గ్రామాల మైనారిటీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన షాదీఖానా భవనాలు తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటికీ అసంపూర్తిగానే.. శిథిలావస్థకు చేరి దర్శనమిస్తున్నాయి. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులైన నిధులు మంజూరు చేసి, అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలని మైనార్టీలు కోరుతున్నారు. మండల కేంద్రం హత్నూరలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. భవన నిర్మాణాన్ని వసతులు లేకుండానే నిర్మించడంతో దశాబ్దాలుగా నిరుపయోగంగా మారి.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కిటికీలు, తలుపులు పూర్తిగా పాడైపోయాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం వృథాగా మారిపోయింది. అలాగే, మండల కేంద్రంలోని కాసాల దౌల్తాబాద్ గ్రామ శివారులో 2004 జూలై 24న అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి షాదీఖానా భవన నిర్మాణం కోసం రూ.7.50 లక్షలు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి కాంట్రాక్టర్ హడావిడిగా పిల్లర్ల వరకు పనులు చేసి వదిలేశారు. రెండు దశాబ్దాలు గడవడంతో భవన నిర్మాణంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. షాదీఖానా భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోవడంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీ రులా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మైనారిటీల సంక్షేమం కోసం షాదీఖానా భవన నిర్మాణాలను పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పండుగలు సంతోషంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని సద్దుల బతుకమ్మ పండుగను అక్టోబర్ 10న, 12న దసరాను నిర్వహించుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సద్దుల బతుకమ్మను పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై నిర్వహించుకోవాలని తెలిపారు. దసరా పండుగను జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధ్వజారోహణ నిర్వహించి, జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో శమీ చెట్టుకు పూజలు చేసుకోవాలని సూచించారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు మైత్రి మైదానంలో రావణ దహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండుగలు జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీలు జైపాల్, మాణిక్యం, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, ప్రకాష్‌రావు, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలను రద్దు చేయండి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అమ్మ ఆదర్శ కమిటీలను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, స్వీపర్లు లేరని, ఉన్న వారిని కూడా అరకొర జీతాలతో పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కావెంజర్లు, స్వీపర్ల బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు కాకుండా గతంలో మాదిరిగా విద్యాశాఖ ద్వారానే వేతనాలు చెల్లించాలని కోరారు. వారికి రూ.15 వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన ప్రసాద్ జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటరాజ్యం, శివశంకర్ , యాదమ్మ, శంకరప్ప , శ్రీకాంత్, లక్ష్మి , సంగీత పాల్గొన్నారు .

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



గోపాల్‌ను పరామర్శిస్తున్న నిర్మల

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని హరిదాస్‌పూర్ పంచాయతీలోని పెద్దమ్మ గడ్డ తండాలో శనివారం టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చుట్టూ పక్కల పరిశ్రమలు ఉండడంతో గ్రౌండ్ వాటర్ అంతా కాలుష్యం అవుతుందన్నారు. గ్రామాల్లో ఇవే నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీడీఎఫ్ నిధుల ద్వారా ప్రతి గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని చూస్తుందన్నారు. అలాగే, మండలంలోని మల్కాపూర్ పెద్ద చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన అక్రమ భవనాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ క్రమంలో భవనం శిథిలాలు విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు గోపాల్‌కు బలంగా తాకాయి. దీంతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌ను టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింలు, వెంకటేశం గౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: మండలంలోని పెద్ద కంజర్ల గ్రామ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల)లో 2024– 25 సంవత్సరానికి బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్సీఎస్, ఎంఎస్డీఎస్, బీజెడ్సీ, బీ.కాం (సీఏ), (హానర్స్) గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి రీజనల్ కోఆర్డినేటర్ సుధాకర్, ప్రిన్సిపాల్ మహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజనం, నోట్‌బుక్స్, బెడ్స్, దుస్తులు మొదలైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేసిన ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శంభుసింగ్ మండలంలోని ఇస్నాపూర్ తిరంగదాబా వద్ద గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో మెదక్ ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 670 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కృష్ణాజిల్లాకు చెందిన హర్షవర్ధన్, పశ్చిమ గోదావరి జిల్లా పాడేరు నుంచి గంజాయి తెచ్చి ఇస్నాపూర్‌లో విక్రయిస్తున్నాడని తెలియడంతో అతడిని పట్టుకుని 10.198 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇరువురిని రిమాండ్ తరలించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

నారాయణఖేడ్: ప్రభుత్వ కార్యాలయాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఖేడ్ మండల సమాచార హక్కు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం సమాచారం కోరే అధికారి పేరు, హోదా సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలనే నిబంధనలున్నా అధికారులు పట్టించుకోకుండా చట్టాన్ని నీరుగారుస్తున్నారన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యకర్తలు పండరియాదవ్, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ తదితరులు

జిల్లాస్థాయిలో విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పటాన్‌చెరు టౌన్: జిల్లాస్థాయి యువజన ఉత్సవ పోటీల్లో పటాన్ చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన వ్యాసరచన, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు, పద్యరచన పోటీలో ద్వితీయ బహుమతిని కళాశాల విద్యార్థులు గెలుపు పొందారని చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఖాసిం బేగ్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, ఐపీఎస్సీ కోఆర్డినేటర్ పూనమ్‌కుమారి, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ సుజాత, డాక్టర్ మంజుశ్రీ, సురేశ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మల్లిక విద్యార్థులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయల్ కళాశాల ప్రిన్సిపాల్ కృపానిధి అన్నారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలో ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ క్రీడలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించారు. పోటీల్లో రాయల్ కళాశాల సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులు రామ్‌చరణ్, దేవిప్రసాద్ మొదటి బహుమతి సాధించారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జీఓ 25ను సవరించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అసంబద్ధ, అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓ 25ను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. నిరసనలో భాగంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు అశోక్ కుమార్, వై.జ్ఞాన మంజరి మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద పిల్లలు చదువుకుంటున్న పాఠశాలలను బలోపేతం చేస్తుందని, పాఠశాలలకు సరిపడ ఉపాధ్యాయులను, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. జీఓ 25 అమలుకు పూనుకోవడం అన్యాయమన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

మునిపల్లి(అందోల్): అశాస్త్రీయ ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓను పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తూ జాక్టో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంతారం పాఠశాల ఉపాధ్యాయులు విరామ సమయంలో నల్ల బాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన



బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈఓ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో విద్యాశాఖ ఎస్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో ఏఈపీ (అడోలేసెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం)లో భాగంగా శనివారం సంగారెడ్డి సైన్స్ కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎయిడ్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణతో పాటు విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రోగ్రాం అధికారి డానియేలు, ఏఎంఓ అనురాధ, సీఎంఓ వెంకటేశం పాల్గొన్నారు.

కల్హేర్‌లో ‘స్వచ్ఛతా హీ సేవ’



స్వచ్ఛతా కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఇంటా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాస్‌లు, పంచాయతీ కార్యదర్శి కృష్ణాచారి, ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్, పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆస్పత్రి సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు.

కార్మికులకు వైద్యపరీక్షలు

నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు డాక్టర్ అరవింద్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వట్‌పల్లి(అందోల్): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ రామలింగం అన్నారు. మండలంలోని నాగులపల్లి, గొర్రెకల్ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ఆధునిక తెలుగు కవుల్లో అత్యంత శక్తివంతమైన కవిత్వాన్ని రచించి ప్రభావితం చేసిన వ్యక్తి జాషువా అని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు నాశేశ్వరం శంకరం మాట్లాడుతూ.. అస్పృశ్యతను తన కవిత్వం ద్వారా తొలగించిన కవి జాషువా అని, కుల వివక్షతను తన కరవాలంతో ఖండించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

జహీరాబాద్ టౌన్: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జహీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం కరెంట్ సరఫరా నిలిపేస్తునట్లు ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మీనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. మహీంద్ర కర్మాగారం సమీపంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఉ. 9.30 గంటల నుంచి మ.1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

◆ **డ్రంకెన్ డ్రైవ్‌లో 70 మందికి జరిమానా**

కల్హేర్(నారాయణఖేడ్): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 70 మందికి జరిమానా విధిస్తూ నారాయణఖేడ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.శ్రీధర్ శనివారం తీర్పు చెప్పారని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్ ప్రధాన కూడలిలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 70 మందిని కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. వారికి రూ.1.05 లక్షలు జరిమానా విధించినట్లు వివరించారు. మద్యం తాగి, రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

◆ **21 మందికి జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీలో పట్టుపడ్డ వారిని శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **విద్యార్థులకు అవగాహన**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానసిక విద్య నిపుణులు బాదల్‌గాం సంతోష్‌కుమార్, స్వప్న దంపతులు సత్ప్రవర్తన, నీతి, నిజాయితీ, సోదరభావం, ఆడపిల్ల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, పట్టుదల, కృషి అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులకు మనోధైర్యం కల్పించారు.

◆ **నవరాత్రి ఉత్సవాలకు విరాళం**

జహీరాబాద్ టౌన్: దేవీ శరన్న నవరాత్రి ఉత్సవాలకు విరాళం అందజేశారు. మండల కేంద్రం మొగుడంపల్లి పోచమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం దసరా పండగ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, భక్తుడు కొంగల్ వెంకట్ లక్ష రుపాయల చెక్కును నిర్వాహకులకు అందజేశారు.

◆ **లింక్ రోడ్ల అభివృద్ధి**

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాలకు దూరభారాన్ని తగ్గించేందుకు లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని మాజీ ఎంపీపీ రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పెద్దచల్మెడ నుంచి ఖమ్మంపల్లి మీదుగా మునిపల్లి గ్రామం వరకు బీటీరోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పిల్లోడి గ్రామం నుంచి గార్లపల్లి వరకు బీటీ రోడ్డు కోసం పనులు కొనసాగుతున్నాయన్నారు.

◆ **కంప్యూటర్ల అందజేత**

కంది(సంగారెడ్డి): ఐఐటీ హైదరాబాద్, అక్షర(అక్షర మాల) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లను బహూకరించారు. శనివారం మండలంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్లను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కంప్యూటర్లను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మహేందర్, ఆనందరావు, నాయకులు రవి, సత్తిరెడ్డి, రాజుగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 8, 9 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం ఖేడ్ పట్టణ అధ్యక్షుడు మొహిద్‌పటేల్ డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మజహర్, నాయకులు చాంద్‌పాష షేక్ అంజద్‌తో కలిసి ఆయా వార్డుల్లో ఆయన పర్యటించారు.

◆ **బాధిత కుటుంబానికి అండ**

పటాన్‌చెరు టౌన్: అవయవదానం చేసిన మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అనిత ఇటీవలే బ్రెయిన్ డెడ్ కాగా, ఐదుగురికి అవయవ దానం చేసింది. శనివారం అనిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

◆ **రాజీమార్గమే రాజమార్గం**

నారాయణఖేడ్: కక్షిదారుల పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోదగ్గ కేసుల్లో రాజీమార్గమే రాజమార్గమని ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. పరస్పర అంగీకారంతో 570 కేసులను పరిష్కరించారు.

◆ **ప్రత్యేక పూజలు**

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీ వైకుంఠపురంలో శనివారం స్వామి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సతీమణి పద్మిని పూజల్లో పాల్గొన్నారు.

◆ **పాఠశాలల అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం(పటాన్ చెరు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని మన ఊరు– మనబడిలో నూతనంగా నిర్మించిన పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు.

◆ **భగత్‌సింగ్‌కు నివాళి**



పటాన్‌చెరు టౌన్: స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలు అర్పించిన గొప్ప దేశ భక్తుడు భగత్ సింగ్ అని ఎండీఆర్ ఫౌండేషన్ కో– ఫౌండర్ పృథ్వీరాజ్ అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చందు, సంతోష్ , ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

◆ **నల్లవాగు ఆక్రమణ తొలగింపు**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులో ఆక్రమణకు గురైన నల్లవాగు కాలువను జేసీబీల సహాయంతో శనివారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని 626, 627, 628 సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన నల్లవాగు కాలువను సర్వే చేసి, పునరుద్ధరిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.